క్లుప్తంగా

పట్టపగలు వెలుగులే..!



మల్దకల్ : మండల కేంద్రంలో పట్టపగలే వీధి లైట్లు వెలుగుతున్నా విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం విద్యుత్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు ఎలాంటి ఆఫ్ ఆన్ స్విచ్‌లు లేకపోవడంతో రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. ఈ విషయమై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అలంపూర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం పంపిణీ చేశారు. రాజోళి మండలం తుమ్మిళ్ల గ్రామం, ఉండవెల్లి మండలం భైరాపురం గ్రామానికి లబ్ధిదారులకు మంజూరైన రూ. 8 వేలు, రూ. 21 వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వావిలాల రంగారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాత పోలీసుస్టేషన్ భవనం



మల్దకల్ : మండల కేంద్రంలోని పాత పోలీసు స్టేషన్ భవనం నిరుపయోగంగా మారింది. మూడేళ్ల క్రితం నూతనంగా నిర్మించిన పోలీసు స్టేషనులోకి మారడంతో పాత పోలీసుస్టేషన్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. భవన పరిసరాలన్నీ పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా మారాయి. అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చేపడుతున్న మరమ్మతు పనుల్లో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల, మండలంలోని కేశవరం గ్రామాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నరేందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిన్న తాండ్రపాడులో 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి తుపత్రాలకు వెళ్లే 11 కేవీ ఫీడర్ మధ్యలో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండడంతో వాటిని కత్తిరించేందుకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి నిర్వాహకులు ఆదివారం విరాళాలు సేకరించారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి స్థానికులు సిద్ధమయ్యారు. ఇందుకుగాను రూ.2 కోట్లు అవసరం అవతుండడంతో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.6లక్షలు విరాళాల రూపంలో వసూలు అయ్యాయని, భక్తులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు. జనవరి 18వ తేదీన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు గడ్డమీది శ్రీను, భరత్, బాలకృష్ణ, రవీందర్, బాలు, కురుమూర్తి, నాగేష్, గోపాల్, శివ, అరవింద్, చిన్న, అయ్యప్ప మాలధారులు, తదితరులు ఉన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయించండి

వీపనగండ్ల: ప్రమాదకరంగా ఉన్న మలుపుతో ప్రమాదం పొంచి ఉందని సంపత్‌రావుపల్లి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపు ఉండడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురువుతున్నారు. మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని అధికారులకు విన్నవించినా స్పందించ లేదని వాపోయారు.

ప్రత్యేక తరగతులతో అవస్థలు

- ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం
- విద్యార్థులకు అందని స్నాక్స్
- చీకటి పడుతుండటంతో సమస్యలు



ఉండవెల్లిలో పదో తరగతి గదిలో విద్యార్థులు(ఫైల్)

ఉండవెల్లి: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోజు సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమయానికి బస్సులు రాక, చీకటి పడటం, సాయంత్రం వేళలో స్నాక్స్ కూడా అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

మారుమూల ప్రాంతాలకు ప్రయాణం..

మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగ, ఇందులో 210 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఉండవెల్లి, బొంకూరు, తక్కశీల, భైరాపురం, పుల్లూరు బాలుర, బాలికల పాఠశాలలకు మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, మారమునగాల, ప్రాగటూరు, గ్రామాల విద్యార్థులు ప్రైవేటు వాహనంలో ప్రయాణిస్తున్నారు. తక్కశీల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల-1,2 గ్రామాల ప్రజలు తక్కశీల గ్రామానికి వస్తున్నారు. బొంకూరు గ్రామ పాఠశాలకు కలుగోట్ల, మెన్నిపాడు, ఏ.బూడిదపాడు గ్రామానికి చెందిన విద్యార్థులు వస్తుంటారు. భైరాపురం గ్రామ పాఠశాలకు బస్వాపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.

ప్రైవేటు వాహనాల్లోనే..

అయా గ్రామాల విద్యార్థులు సైకిళ్లు, ఆటోలు, నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. పాఠశాల సమయాలకు బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాల్లోనే ప్రయాణిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు రోజు సాయంత్రం 4: 15 నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఉదయం 8: 30 గంటలకు వచ్చి సాయంత్రం 6 గంటల తర్వాత ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రస్తుతం తొందరగా చీకటి కావడంతో విద్యార్థినులు భయాందోళనకు గురువుతున్నారు.

రవాణా భత్యం లేదు..

గ్రామీణ ప్రాంత విద్యార్థులు మూడు కిలో మీటర్ల దూరం ఉన్న ప్రభుత్వం పాఠశాలలో చదువుకుంటే గత ప్రభుత్వం రవాణ భత్యం ఇచ్చేది. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున ఏడాదికి రూ.6000 ప్రభుత్వం మంజూరు చేసేది. 2019లో గ్రామీణ విద్యార్థులకు రవాణా భత్యం ఇచ్చి రద్దు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉన్నతాధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని



నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆకలితోనే ఉంటున్నాం..

ఉదయం 9 గంటలకే పాఠశాలకు వస్తున్నాం. ఇంటికి వెళ్లేందుకు రోజు సాయంత్రం 6 గంటలు దాటుతోంది. పాఠశాలలో స్నాక్స్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు పడుతున్నాం. ఆకలితో నీరసించి ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

- మౌనిక, పదో తరగతి, ఉండవెల్లి జెడ్పీ పాఠశాల

రవాణ ఛార్జీలు ఇవ్వాలి..

ఇతర గ్రామాల్లో చదువుకునేందుకు రవాణా సౌకర్యం లేదు. కొన్ని గ్రామాలకు అసలు ఆర్డీనరీ బస్సులు రావడం లేదు. ప్రైవేటు వాహనాల్లోనే వెళ్లాల్సి వస్తోంది. ఛార్జీలు భారమవుతున్నాయి. పేద విద్యార్థులకు ప్రభుత్వం రవాణా చార్జీలు మంజూరు చేయాలి.

- శ్రావణి, పదో తరగతి

చేతులకు తాళ్లు కట్టుకొని నిరసన



గద్వాలలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గద్వాలటౌన్ : తమకు న్యాయం చేయాలని, ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె 20వ రోజు కొనసాగింది. ఆదివారం ఉద్యోగులు చేతులకు తాళ్లు కట్టుకుని సంకెళ్ల తరహాలో బంధించుకుని నిరసన తెలిపారు. దీక్షకు జీహెచ్ఎం, తపస్, ఎస్టీయూ, డీటీఎఫ్ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు కేజీబీవీ ఎస్ఓలు, సీఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం



అయిజ : మున్సిపాలిటీలోని భరత్‌నగర్ కాలనీలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్‌కీబాత్ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. మహా కుంభమేళా, కేటీబీ భారత్ హై హమ్ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రదీప్ కుమార్, వీరేశ్, రాము, పరమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు(పుల్లూరు)కు స్టాపేది ?



రాష్ట్ర సరిహద్దులో ఉన్న పుల్లూరు గ్రామ బోర్డు

ఉండవెల్లి: రాష్ట్ర సరిహద్దు గ్రామం పుల్లూరుకు బస్ స్టాప్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులోకే టికెట్ కొట్టాలి కానీ ఆర్టీసీ సిబ్బంది మాత్రం అలంపూర్ చౌరస్తాకే టికెట్ కొట్టడంతో ప్రయాణికులపై భారం పడుతుంది. పుల్లూరు తెలంగాణలోకి లేదా..లేక అక్కడ నిలిచేందుకు బస్టాప్ లేదా అని ప్రయాణికులు ఆలోచనలో పడ్డారు. ఉండవెల్లి మండలం పుల్లూరు సరిహద్దు ప్రాంతం కావడంతో అక్కడ జాతీయ రహదారి సిబ్బంది గతంలో బస్సును నిలిపేందుకు బస్ షెల్టర్ నిర్మించారు. కానీ ప్రస్తుతం రహదారి కాస్తా పెరగడంతో బస్సు షెల్టర్ తొలగించారు. ప్రస్తుతం పుల్లూరు స్టాప్ ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాల్మీకులు ఐక్యంగా పోరాడాలి



గద్వాల : వాల్మీకి ఉద్యోగ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కర్నూల్ జిల్లా ఎమ్మెల్సీ బీటీ నాయుడు, గట్టు తిమ్మప్ప, మధుసూదన్‌బాబు, బాసుశ్యామల, రామాంజనేయులు కలిసి ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి సంఘం కమ్యూనిటీ భవనంలో ఉద్యోగులు, నాయకులు ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కోటేష్, రమేష్ నాయుడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులతో యోగా చేస్తున్న నాగరాజు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఉన్న యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ అధికారి నాగరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం గంటపాటు యోగా చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని తెలిపారు. యోగాతో శరీరం ధృడంతో పాటు ఉల్లాసంగా ఉంటుందన్నారు. పలువురు విద్యార్థులు, యువకులు యోగా శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ యుగంధర్

కేటీదొడ్డి: బాలల హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సీఆర్పీఎఫ్ కన్వీనర్ యుగంధర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం బాలల హక్కుల పరిరక్షణ మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలు వ్యతిరేకిస్తూ, బాలల హక్కుల రక్షణ కల్పిస్తూ బడి బయటి ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించేలా బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వీరన్న, బడేసాబ్, గాజుల కృష్ణ, రంగన్న ,సవిత, గీత, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అయిజ : మండల పరిధిలోని కుటుకనూరులో వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు జైనుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తేమ శాతం ఎక్కువ లేకుండా చూసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాజా హుసేన్, వెంకన్న, నాగరాజు, హనుమంతు, నరసింహులు, రామకృష్ణ, మాబాషా, సత్యారెడ్డి, నరసింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

వనపర్తి టౌన్: ఆర్టీసీ పదవీ విరమణ ఉద్యోగుల సంఘం 2025 నూతన సంవత్సర డైరీని ఆదివారం తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో గౌరవ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.సత్యన్నచారి మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో రెగ్యులర్ ఎంప్లాయిస్ వారికి యూనియన్ అంటూ లేకుండా పోయిందని, ఇటువంటి తరుణంలో 2002లో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 వేల మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, మరి ఆర్టీసీ ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం లేదని, ఈ విషయంపై జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఏడేళ్లుగా అనేక కార్పొరేషన్ల వారికి, ఆర్టీసీ యాజమాన్యానికి వినతులు అందించామని తెలిపారు. కార్మికులకు పెన్షన్ కింద రూ.7500 ఇవ్వడంతో పాటు డీఏ, భార్య, భర్తలకు వైద్య సదుపాయం ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యక్షులు రాంచంద్రారెడ్డి, ఆర్.అంజయ్య, ఉపేందర్, సత్యనారాయణగౌడ్, ఎమ్మెస్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, స్వామిగౌడ్, ఆర్.సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గద్వాలను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలి



ఎస్టీటీ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్ : జిల్లాలో ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో విద్యా బోధన చేసి గద్వాలను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, ఎస్టీటీ, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల నూతన సంవత్సర-2025 క్యాలెండర్‌ను వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలోనే పరిష్కరం లభించనుందన్నారు. నూతన సంవత్సరం అన్ని వర్గాల ప్రజలకు మంచి చేకూరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీటీ యూనియన్ నాయకులు గోపాల్, వినోద్‌కుమార్, హనుమంతునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌కుమార్, సోమసుందర్‌రెడ్డి, వెంకటయ్య ఎస్టీయూ నాయకులు యూనుస్‌పాష, పులిపాటి లక్ష్మణ్, శంకర్‌నాయక్, శ్రీహరి, కృష్ణయ్య, జయరాజు, కిషోర్‌చంద్ర, విజయభాస్కర్, సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భేషరతుగా కొనుగోలు చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

అయిజ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని సింధనూరు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. ప్రధాని మోదీ రైతులకు మద్దతు ధర ప్రకటించి, ధాన్యం కొనుగోలు చేస్తుందని, హమాలీ, పురికోస ఖర్చులు కూడా కేంద్రం భరిస్తుందని తెలిపారు. ధాన్యానికి ఎలాంటి తరుగు తీసుకోకుండా కొనుగోలు చేయాలని కేంద్రం నిబంధనలు ఉన్నా, కాంగ్రెస్ నాయకుల అనుచరులు తరుగు, హమాలీ పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనల మేరకు వరి ధాన్యం కొనుగోలు చేయకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్ గౌడ్, నరసింహులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ జిల్లా కోర్డినేటర్ కుర్వ పల్లయ్య

మానవపాడు: వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల వసతి గృహాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు భోజనం నాణ్యమైనదిగా అందిస్తున్నారా..? లేదా అని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయాలన్నారు. వసతి గృహాల చుట్టూ పందులు స్వైరవిహారం చేస్తున్నాయని చేస్తున్నాయని, అపరిశుభ్ర వాతావరణంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాధవ్, పరుశరాముడు, నరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్‌లో మాజీ ఎమ్మెల్యే పూజలు



దేవాలయం వద్ద కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

అలంపూర్ : దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలోని ఆలయాలను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆయన సతీమణి డాక్టర్ సబితలతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు..

మల్దకల్ : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, శకుంతలలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కార్యక్రమంలో రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై విజయభాస్కర్

అయిజ: నూతన సంవత్సరం సందర్భంగా మున్సిపాలిటీలో రెండు రోజులపాటు నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ప్రథమ బహుమతి రూ. 10 వేలు రాజేష్ కన్నా, బాషా, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు మహేశ్వర్ రెడ్డి, రాజేష్, తృతీయ బహుమతి రూ. 3 వేలు నవీన్, తిరుమల్ కై వసం చేసుకున్నారు. విజేతలకు ఎస్సై విజయభాస్కర్, సింగిల్ విండో డైరెక్టర్ రాముడు నగదు బహుమతి, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపైర్లు బాష, బాలకృష్ణ, నాగరాజు, రమేష్, బహుమతుల దాత విక్రాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వేలాయె..

- రేపటి నుంచి ఐదు రోజుల పాటు పూజలు
- మల్లాపురం గ్రామానికి వేలాదిగా తరలిరానున్న భక్తులు



స్వామివారి ఉత్సవమూర్తి విగ్రహాలు

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో ఈనెల 31 నుంచి జనవరి 5, 2025 వరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రముఖ వేదపండితుడు వెంకటశేషశర్మ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు హాజరవుతారన్నారు. 31న ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆత్మకూర్‌లో గ్రామోత్సవం, జనవరి 1న దేవత ఆవనం , విశ్వక్సేన, పుణ్యాహావాచం, అంకురార్పణ, కళశ స్థాపన, దిక్పాలకపూజ, గణపతి హోమం, 2వ తేదీన స్వామివారికి అష్టోత్తర కళశాలతో మహాస్నానం, అర్చన, నత్యహోమం, 3వ తేదీన సుదర్శణ హోమం, లక్ష్మీహోమం, గుడాజ్యోతి, మహిళా భక్తులచే శ్రీలక్ష్మీనారసింహస్వామి వారికి అభిషేకం, వేదపారాయణం, 4వ తేదీన స్వామివారికి కల్యాణోత్సవం, రథోత్సవం, 5వ తేదీన చక్రస్నానం, సుబ్రమణ్య, అయ్యప్ప మూర్తులకు అభిషేకం, పుష్పయాగం, మంగళశాసనం, ధ్వజావరోహణ, స్వస్తి వాచకం, కర్తలకు శేషవస్త్రాలతో వేదాశీస్సులు తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని, తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

31న ఉచిత వైద్య శిబిరం

అమరచింత: మండల కేంద్రంలో ఈనెల 31న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంఆర్ఎం ట్రస్టు సభ్యులు సౌజన్యారెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి జన్మదినం సందర్భంగా గుండెకు సంబంధించిన ఉచిత వైద్య చికిత్స శిబిరాన్ని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలతో పాటు ఫ్లెక్సీని విడుదల చేశారు. మండలంలోని గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సౌజన్యరెడ్డి, డాక్టర్ కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.